క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



గుడివాడ టౌన్ : విద్యార్థి దశ నుంచే శాంతి భద్రతలకు సంబంధించిన చట్టాలపై అవగాహన ఉండాలని టూటౌన్ సీఐ జెఆర్‌కె హనిష్ అన్నారు. బుధవారం స్థానిక ఏకేటీపీ మున్సిపల్ బాలికల పాఠశాల్లో విద్యార్థులకు పోలీస్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుడ్ టచ్–బ్యాడ్‌టచ్–పోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్‌లు పి.లవరాజు, జాస్మిన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు మండల పరిధి చోరగుడి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామారావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్రి బాబూరావు స్థానిక నాయకులతో కలిసి బుధవారం రామారావు మృతదేహానికి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బాసు రమేష్, అమ్మిరెడ్డి శివరామకృష్ణ, అడపా వెంకట్, నల్లజోరు సీతారామయ్య, బంద్రపల్లి నాగరాజు, మాతంగి ప్రవీణ్, మణిమాల అంకమ్మ, కనుమూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడి హుండీ కానుకల ఆదాయం రూ.95,789



పామర్రు: స్థానిక గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల ఆదాయం రూ.95,789 వచ్చినట్లు ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం హుండీ కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయశాఖ లెక్కింపు తనిఖీ అధికారిగా ఉంగ్రపూడి వీరాంజనేయ స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీవీఎస్ వర ప్రసాదరావు వ్యవహరించారని తెలిపారు. భక్తులు ఆరు నెలల 25 రోజుల పాటు హుండీలో వేసిన కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కూసం ప్రభాకర్‌రెడ్డి, అర్చకులు సోము పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి అందజేత



గుడివాడ టౌన్ : శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం నాయకులు అంగన్‌వాడీ కేంద్రానికి వంట పాత్రలు, ఇతర సామగ్రి అందజేసినట్లు సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక నీలామహల్ రోడ్డులోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్ (అల్లం బడి) అంగన్‌వాడీ కేంద్రానికి వంటసామగ్రి, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు, చాపలు వితరణగా ఇచ్చామన్నారు. సేవాసంఘం సభ్యుడు మజ్జాడ నాగరాజు వితరణతో ఇవి ఏర్పాటు చేశామన్నారు.

క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే నయం చేయడం సులభం



గుడివాడ టౌన్: క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే నయం చేయడం సులభమని లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి అధ్యక్షుడు ఎం.సురేష్ అన్నారు. రూరల్ మండలం బిళ్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి. కేశవరావు, ఉపద్రష్ట రాంబాబు, ఎంవీ శేఖర్, ఆర్. వేణుబాబు, ఆర్. శేషగిరిరావు, స్కూల్ హెచ్‌ఎం వి. నాగేశ్వరరావు, ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణ..
అధికారం అండతో అరాచకం

పట్టించుకోని పాలకులు



పామర్రు కూడలికి పక్కనే ఆక్రమణకు గురైన రహదారి



రహదారిలో హోటల్ నిర్వహణ



రహదారిని ఆక్రమించి ఆహార పదార్థాలను వండుతున్న హోటల్ నిర్వాహకులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పామర్రులోని నాలుగురోడ్ల కూడలి పక్కనే అత్యంత విలువైన అంతర్గత రహదారిని పచ్చనేతతో పాటు మండల పదవిని అడ్డం పెట్టుకుని అరాచకాలు చేస్తున్న జన సైనికుడు ఆక్రమించి తమ వ్యాపారాలను యథేచ్ఛగా చేసుకుంటున్నారు. వారి వ్యాపార వ్యర్థాలను పక్కనే ఉన్నభవనంలో వేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదేమని ఎవరైనా అడిగితే వారిపై గొడవలకు దాడులకు దిగటం పరిపాటిగా మారింది.

ఎన్టీఆర్‌కు బాల్య స్నేహితుడు..

ఈ రహదారికి పక్కనే ఉన్న భవనం యజమాని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు బాల్య స్నేహితుడు. టీడీపీలో పలు పదవులు చేసి దివంగతులయ్యారు. ఎన్టీఆర్ బాల్య స్నేహితుడి కుమారుడు ప్రస్తుతం పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యారు. దీనిని ఆసరాగా తీసుకుని 80 సంవత్సరాల నుంచి వారికి చెందిన ఈ భవనం పక్కనే ఉన్న రహదారిని పచ్చనేత, సైనికుడు కలిసి ఆక్రమించారు. ఈ రోడ్డులో ఎవరూ నడవకుండా తొలుత అడ్డంకులను వేసి వారి వ్యాపారాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. వ్యాపార వ్యర్థాలను పక్కనే ఉన్న భవనంలోకి వదులుతూ ఉండటంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధంగా మారింది. ఈ విషయమై పక్షవాతానికి గురైన వ్యక్తి భార్య ఒంటరి పోరాటం చేస్తున్నా పంటించుకునే వారు లేరు. స్థానిక ప్రజా ప్రతినిధికి, పంచాయతీ, పోలీసు వారి చుట్టూ తిరిగి మొరపెట్టుకున్నా ఆమె వేదన అరణ్య రోదనగానే మారింది. కాగా ఈ భవనంపై వచ్చే అద్దెతోనే బతుకుతున్న ఈ దంపతులు ప్రాణభయంతో బతుకుతున్నారు.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా..

మచిలీపట్నంలో ఇటీవల కలెక్టర్‌ను కలిసి బాధితురాలు ఫిర్యాదు చేసినా, పోలీసులు కేసు నమోదు చేయకుండా రాజీ అయిందని అబద్ధపు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రహదారిని ఆక్రమించిన ఇరు పార్టీల నేతలు తమపై కలెక్టర్‌కు అర్జీ ఇచ్చిందనే కోపంతో ఆ మహిళను దుర్భాషలాడుతూ, రాత్రిళ్లు ఇంటిపైకి తాగుబోతులను పంపిస్తున్నారు. అదేవిధంగా బాధితుల ఇంటిపై రాళ్లు, మద్యం ఖాళీ సీసాలను విసురుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆక్రమించిన రోడ్డుపై హోటల్ నిర్వహిస్తున్నారు. ఈ హోటల్ నుంచి వచ్చే మురుగునీటిని తమ ఇంట్లోకి వదులుతున్నారని, ఆ దుర్వాసనతో ఉండలేక పోతున్నామని భవనం యజమానులు ఆవేదన చెందుతున్నారు ఏళ్ల తరబడి టీడీపీలో సేవ చేసిన తమకే న్యాయం చేయడం లేదని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు న్యాయం చేసి ఆదుకోవాలని బాధితులు అభ్యర్థిస్తున్నారు.

శ్రీ వెంకటేశ్వరునికి గరుడ సేవ



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు



గరుడ సేవలో స్వామికి పూజలు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి పౌర్ణమిని పురస్కరించుకుని గరుడ సేవను చేపట్టారు. స్వామివారిని ప్రధాన వీధుల వెంబడి ఊరేగించారు. అడుగడుగునా మహిళా భక్తులు స్వామికి పండ్లు, టెంకాయలను సమర్పించి హారతులిచ్చారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు చేపట్టారు.

10న శ్రీ లక్ష్మీ గణపతి హోమం

గుడివాడ టౌన్ : స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీన శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు రూ. 516 చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

అర్హులకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు కృషి



గుడివాడ టౌన్ : పట్టణంలోని అర్హులకు ఇళ్ల నిర్మాణం చేపట్టేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం ఆయన వ్యక్తిగత కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పీఎంఏవై పథకం అమలు చేస్తున్నామన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి పథకం వర్తింపజేస్తామని, దరఖాస్తు చేయని వారి పేర్లు నమోదు చేసి వారికి గృహ నిర్మాణం చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. హౌసింగ్ డీఈ శివప్రసాద్, ఏఈలు సురేంద్ర, సాయి పవన్, పృథ్వి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ సౌకర్యాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న రాజేష్

గుడివాడ టౌన్ : స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మూడు రోజుల వర్క్‌షాప్‌ను బుధవారం ప్రారంభించారు. అక్యూరైజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి. రాజేష్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మిషన్ లెర్నింగ్ సాంకేతికతలపై లోతైన అవగాహన ఉండాలన్నారు. ప్రస్తుత ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో ఈ రెండు సాంకేతిక రంగాలు అవసరాన్ని ఆయన వివరించారు. పరిశ్రమలకు అనుగుణంగా ఉపయోగపడే అనుభవ జ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కరస్పాండెంట్ కోదండ రామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్, హెచ్‌ఓడి ఎం. నాగు, అధ్యాపకులు జి. మురళీకృష్ణ, నవీన్ త్రినాథ్ పాల్గొన్నారు.

లింగవరం గ్రామ సమస్యలు పరిష్కరించండి

గుడివాడ టౌన్ : రూరల్ మండలం లింగవరం గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని సామాజిక కార్యకర్త ఎ. రవికిరణ్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమస్యల వివరాలు విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగవరంలో పారిశుద్ధ్య సమస్య అధికంగా ఉందని తెలిపారు. రెండు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదని పేర్కొన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

అన్నసమారాధన



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎంపీపీ

ముదినేపల్లి రూరల్: స్థానిక బంటుమిల్లిరోడ్డులో పెయ్యేరు పంచాయతీ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అమ్మవారికి పూజలు చేసి సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బోయిన రామరాజు, జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, నాయకులు బాబురాజేంద్రప్రసాద్, కిషోర్, సుధాకరరెడ్డి, సతీష్, రాచూరి కుమార్, సత్యనారాయణ, సాయిబాబు, నరసింహారావు, గణేష్, కొల్లి నాని, బుజ్జేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటవి బాపిరాజువి ఆదర్శ రచనలు

కలిదిండి(కైకలూరు): ప్రముఖ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, నాటకకర్త అడవి బాపిరాజు సాహిత్య సేవలు నేటి సమాజానికి ఆదర్శనీయమని కలిదిండి శాఖ గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. బాపిరాజు జయంతి సందర్భంగా గ్రంథాలయంలో ఆయన చిత్రపటం వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు బాపిరాజు సేవలను కొనియాడారు.

షెడ్డు నిర్మాణానికి విరాళం



విరాళమందిస్తున్న తోలేటి సోదరులు

ముదినేపల్లి రూరల్: శ్మశాన వాటికలో షెడ్డు నిర్మాణానికి సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అర్చకుడు బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. సింగరాయపాలెం శ్మశాన వాటికలో విశ్రాంతి షెడ్డు నిర్మిస్తున్నారు. శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గతంలో అర్చకుడిగా పనిచేసిన తోలేటి కృష్ణమోహన్ మరణించారు. ఈయన కుమారులు వీరభద్రశర్మ ప్రధాన అర్చకుడిగా శివరామకృష్ణ అర్చకుడిగా కొనసాగుతున్నారు. తండ్రి కృష్ణమోహన్ జ్ఞాపకార్థం తమ తల్లి రాజ్యలక్ష్మీతో కలిసి రూ.లక్ష విరాళాన్ని స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోయిన విమలరామరాజు, కార్యదర్శి సీతారామరాజుకు అందజేశారు.

ప్రజల వద్దకే ఆధార్ సేవలు

కైకలూరు: ప్రజల వద్దకే ఆధార్ సేవలు అందించేందుకు కాలనీలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని గుడివాడ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ముత్యాల శ్రీనివాసు తెలిపారు. ఆటపాక హోలీ క్రాస్ పాఠశాల్లో ఆధార్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా అక్టోబరు 8 నుంచి 14 వరకు ఆధార్ సేవలు అందిస్తున్నామన్నారు. గురువారం హోలీక్రాస్ స్కూల్, శుక్ర, శనివారాలు ముదినేపల్లి ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్ : జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకుని ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ గుడివాడ ముత్యాల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ నెల 6 నుండి 10వ తేదీ వరకు గుడివాడ డివిజన్ పరిధిలో ఈ వారోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కైకలూరు: అనారోగ్య కారణాలతో జీవితం విరక్తి చెంది సెప్టెంబరు 27వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు శృంగవరప్పాడు గ్రామానికి చెందిన మోరు లక్ష్మణ(49)కి ఐదేళ్లుగా కిడ్నీ, ఆస్తమా సమస్యలతో బాధపడుతున్నాడు. వాటిని తట్టుకోలేక లక్ష్మీపురం సమీపంలో చెరువు వద్ద పురుగుల మందు తాగి అచేతనంగా పడి ఉన్నాడు. దీంతో కుమారుడు ఆకివీడు, భీమవరం, గుంటూరు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లు ఉన్నారు. కుమారుడు పవన్‌కుమార్ ఫిర్యాదుతో బుధవారం హెడ్‌కానిస్టేబుల్ విజయబాబు కేసు నమోదు చేశారు.

రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్‌కు సత్కారం



ఎస్టేట్ ఆఫీసర్‌ను సత్కరిస్తున్న నిత్యానందం, ఏఎంసీ చైర్మన్

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని రైతుబజార్‌కు స్వచ్ఛ–ఆంధ్ర రాష్ట్రస్థాయి అ వార్డు రావడంతో ఆ బజార్ ఎస్టే ట్ ఆఫీసర్ కె.చంద్రమోహనరావును బుధవారం రైతు బజార్లో, వ్యవసాయ మార్కెట్ కమిటీ కా ర్యాలయంలో పలువురు ఆయ న్ను సత్కరించారు. మార్కెటింగ్‌శాఖ ఏడీ ఎల్.నిత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొ ని ఎస్టేట్ ఆఫీసర్‌తో పాటు సిబ్బంది సేవలను కొనియాడారు. ఏఎంసీ చైర్మన్ దోనే పూడి శివరామయ్య, కార్యదర్శి అక్బర్ బాషా, వెంపటి గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్



వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర పార్టీ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మాజీ ఎంపీ నందిగం సురేష్‌తో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పామర్రు నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులపై అనిల్‌కుమార్ ఆయనతో చర్చించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, అధికార పార్టీ చేస్తున్న దురాగతాలను వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

చినముత్తేవి(మొవ్వ): పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించి 16 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఇవ్వలేదని, ఇప్పటికైనా తమ గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మాణానికి సహకరించాలని మొవ్వ మండలం చినముత్తేవి గ్రామస్తులు కలెక్టర్ డీకే బాలాజీకి విన్నవించుకున్నారు. మొవ్వ మండలం చినముత్తేవి గ్రామానికి బుధవారం విచ్చేసిన కృష్ణా జిల్లా కలెక్టర్‌కు చినముత్తేవి గ్రామస్తులు పలు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని అయినంపూడి డ్రైయినేజీపై శిథిలమైన వంతెన నిర్మాణం వెంటనే చేపట్టి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు మాదాసు నాగులు, నాగమణి, వెంకటలక్ష్మి, శివ, ఐశ్వర్య, రామలక్ష్మి, వేణుగోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన



పామర్రులో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక గఫార్ సెంటర్‌లోని వ్యాపార సముదాయాల్లోని వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో సాధారణ కుటుంబాలకు ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు వల్లూరిపల్లి గణేష్, పామర్రు ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై వెంకటాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర మాట్లాడుతూ కేంద్రం జీఎస్టీ తగ్గించడతో వివిద వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ఉదాహరణకు విద్యార్థులు కొనుగోలు చేసే నోటు పుస్తకాల ధరలు తగ్గుతాయన్నారు. కలిదిండి మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరీ, నాయీ బ్రాహ్మణ, మత్స్య కార్పొరేషన్ల డైరెక్టర్లు లంకా రత్నారావు, అంగ్రాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంచినీటి చేపల పెంపకంతో అధిక దిగుబడులు



గోపవరంలో రైతులకు వలలు పంపిణీ చేస్తున్న మత్స్యశాఖ అధికారులు

కైకలూరు: మంచినీటి చేపల పెంపకంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పశ్చిమగోదావరి జిల్లా ఉండి, మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్(ఐసీఏఆర్), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఆక్వా కల్చర్(సీఐఎఫ్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో 'మంచి నీటి చేపల పెంపకంలో ఆధునిక సాగు పద్ధతులు' అనే అంశంపై బుధవారం గోపవరంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కైకలూరు ప్రాంతం ఆక్వా రంగానికి అనువుగా ఉందన్నారు. విజయవాడకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుకూలంగా ఆక్వా రైతులు శాస్త్ర, సాంకేతిక పద్ధతులు అలవర్చుకోవాలన్నారు. మండలం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి గణపతి ఆక్వా రైతులు అప్పడా చట్టం ప్రకారం లైసెన్సులు పొందాలన్నారు. అనంతరం రైతులకు వలలు, చేపల మందులు, సున్నం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపవరం మత్స్యకార సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి



అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న డీఎన్నార్, నాయకులు

కైకలూరు: ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో పయనించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. పేటేటి వివేకానంద, జిల్లా పంచాయతీ రాజ్ విభాగ ఉపాధ్యక్షులు పడవల శ్రీనివాస్, చిట్టూరి బుజ్జి ఆహ్వానంతో బుధవారం కలిదిండి మండలం గురవాయిపాలెం సరస్వతీదేవి ఆలయం వద్ద అయ్యప్ప, భవానీలకు నిత్య అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి కూసంపూడి కనకదుర్గా రాణి, మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము, నాయకులు అంజి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రామారావు, నాగు, నవీన్, పోసిన కొండ, విష్ణు, అనిల్‌కుమార్, ఫిర్దోస్ ఖాన్ పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

కైకలూరు: స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత బుధవారం విలేకరులకు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల ఫెన్సింగ్ పోటీలు మైలవరం డాక్టర్ లక్కిరెడ్డి హనుమరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో మంగళవారం నిర్వహించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో తమ కాలేజీలో బీఎస్సీ చివరి ఏడాది విద్యార్థులు కె.శారన్ రోజా, పి.మీనాక్షి, పి.విన్నిలు ప్రథమ స్థానం సాధించారని పేర్కొన్నారు. నవంబర్ 2న పంజాబ్ గురు నానక్‌దేవ్ యూనివర్సిటీ అమృత్‌సర్‌లో జరిగే జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, శిక్షణ అందించిన వ్యాయామ అధ్యాపకులు ఎం.శివ నాగరాజును కళాశాల సిబ్బంది అభినందించారు.

భారీ వర్షం.. రహదారులు అస్తవ్యస్తం



మండవల్లి నేషనల్ హైవేపై నిలిచిన వర్షం నీరు

మండవల్లి: భారీవర్షంతో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. స్థానిక నేషనల్ హైవే, కైకలూరు వీధిల్లో రహదారులపై వర్షం నీరు నిలిచి వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. పాదాచారులు రాకపోకలు సాగించే తరుణంలో వాహనాలు వెళుతుంటే దుస్తులపై వర్షం నీరు పడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డ్రెయినేజీ అధ్వానం

మండవల్లి: స్థానిక కైకలూరు వీధిలో ఆక్రమణలతో రహదారి అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడంతో రహదారిపై మురుగునీరు నిలిచి ప్రజలకు అంటువ్యాధులు సోకుతున్నాయని వాపోతున్నారు. డ్రెయిన్‌లో నీరు దిగువకు వెళ్లకుండా ఎదురు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీని ఆధునికీకరించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.